అందని ద్రాక్షగా వైద్యం..!

- పూర్తికాని హెల్త్ సబ్‌సెంటర్ల నిర్మాణం
- వైద్యానికి ఆదివాసీలు దూరం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


నిర్మాణ దశలో ఉన్న ఉల్లిపిట్ట ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం

తిర్యాణి: ఆదివాసీలకు మెరుగైనా వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి మూడు వేల మంది జనాభాకు ఒక ఆరోగ్య ఉపకేంద్రం ఏర్పాటు చేసింది. కాని ఆదివాసీ మండలాల్లో నేటికీ కొన్ని హెల్త్‌సెంటర్‌ల నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయి. నిత్యం సీజనల్ వ్యాధుల బారిన పడే ఆదివాసీలకు అందుబాటులో వైద్యసేవలు లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి రోగాలకు సైతం ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు.

మండలంలో 10 ఆరోగ్య ఉపకేంద్రాలు..

మండలంలో 29 గ్రామపంచాయతీలు ఉండగా వీటి పరిధిలో ప్రభుత్వం 10 హెల్త్ సబ్ సెంటర్లను ఏర్పాటు చేసింది. ఈ సబ్‌సెంటర్ల ద్వారానే ప్రాథమిక చికిత్సతో పాటు గర్భిణులకు టీకాలు, మలేరియా నివారణ మందులు, రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్యచికిత్స అందిస్తారు. కాగా 2007లో ఐటీడీఏ ద్వారా రాష్ట్రీయ స్వయం వికాస్ యోజన కింద ఒక్కో భవన నిర్మాణానికి రూ.7 లక్షల నిధులు మంజూరయ్యాయి. గంభీరావుపేట, తెలండి, తిర్యాణి, గుండాలలో మాత్రమే హెల్త్ సెంటర్ భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. కాని మంగి, రోంపెల్లి, గిన్నెదరి, ఉల్లిపిట్ట, దేవాయిగూడ గ్రామాలల్లో ఇప్పటికీ భవన నిర్మాణాలు వివిధ దశల్లోనే కొనసాగుతున్నాయి.

అందని వైద్య సేవలు..

గ్రామాల్లో ఆరోగ్య ఉపకేంద్రాలకు పక్కా భవనాలు లేవనే సాకుతో కొంతమంది ఏఎన్‌ఎంలు మంచిర్యాల, బెల్లంపెల్లి, తాండూర్ తదితర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. వీరు మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కాగా మండలంలో కొన్ని గ్రామాలకు నేటికీ సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో మారుమూల గ్రామాల ప్రజలు చిన్నపాటి వ్యాధి వచ్చిన 10 నుంచి 20 కిలోమీటర్ల దూరం కాలినడకన, ఎండ్లబండ్లపై ప్రయాణించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంటుంది. పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానిక ఆదివాసీ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధింత శాఖ అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు వేగవంతం చేసి మెరుగైన వైద్యసేవలు అందించాలని మండలవాసులు కోరుతున్నారు.

వెంటనే పనులు పూర్తి చేయాలి



మండలంలోని ఆరోగ్య ఉపకేంద్రాల భవనాల నిర్మాణం కోసం పదేళ్ల క్రితమే పునాదులు తవ్వినా నేటికీ చాలాచోట్ల నిర్మాణ పనులు పూర్తి కాలేదు. పలుమార్లు సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలి. స్థానికంగా ఉండే రెగ్యులర్ ఏఎన్‌ఎంలను నియమించాలి.

– కోట్నాక గణపతి, ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు

‘ధరణి’ సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- అధికారులతో సమీక్షా సమావేశం


మాట్లాడుతున్న కలెక్టర్

ఆసిఫాబాద్: ధరణి పోర్టల్‌లో వచ్చిన దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి ధరణి ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ధరణిలోని 33 మాడ్యూల్స్ ద్వారా అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి రికార్డులు అనుసరించి పూర్తిస్థాయి నివేదిక రూపొందించాలన్నారు. ఎఫ్ లైన్, కల్యాణ లక్ష్మి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పేరు, విస్తీర్ణం కోసం వచ్చిన దరఖాస్తులను రికార్డు ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వాటిపై పూర్తి నివేదిక రూపొందించి అందజేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. జీవో 59కింద వచ్చిన దరఖాస్తులకు సంబంధించి మొదటి విడత మొత్తాన్ని చెల్లించేలా చూడాలన్నారు. సమావేశంలో ఆర్డీవో రాజేశ్వర్ పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపం లేని సమాజాన్ని నిర్మిద్దాం

ఆసిఫాబాద్‌అర్బన్: పౌష్టికాహారం లోపం లేని సమాజాన్ని నిర్మిద్దామని కలెక్టర్ హేమంత్ బోర్కడే పిలుపునిచ్చారు. పోషణ్ మాసం ముగింపు సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో సోమవారం మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ సమతుల్యమైన పౌష్టికాహారాన్ని అందించినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. బాలింతలు, కిశోర బాలికలలో రక్తహీనత లోపం తగ్గించడమే లక్ష్యంగా పోషణ్ పక్వాడ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిరుధాన్యాలను అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మిల్లెట్ బండి ప్రారంభం

మహిళాశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన మిల్లెట్ బండిని కలెక్టర్ ప్రారంభించారు. రాగులు ఇడ్లీ, దోశ, జావ, అంబలి లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి సావిత్రి, సీడీపీవోలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో కలెక్టర్ హేమంత్ సహదేవ్ రావ్ బోర్కడే, జిల్లా అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్, ఎంపీపీ మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, వివేక్, శ్రీనివాస్, మురళీగౌడ్, రమేష్, అంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డు నిర్మించాలని వినతి

నూతనంగా జిల్లా కేంద్రం నుంచి నిర్మిస్తున్న నాలుగు వరుసల హైవేరోడ్డు నుంచి కేస్లాపూర్ హనుమాన్ ఆలయం, అయ్యప్ప ఆలయాల వరకు సర్వీసు రోడ్డు నిర్మించాలని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్‌లు కలెక్టర్‌ను కోరారు. సోమవారం జాతీయ రహదారి నిర్మాణాన్ని పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్ సహదేవ్ రావ్ బోర్కడేకు కేస్లాపూర్‌వాసులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎంపీపీ మల్లికార్జున్, ఆలయ అర్చకులు శిరీష్‌శర్మ, కమిటీ సభ్యులు ఉన్నారు.

క్లుప్తంగా

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి


చలివేంద్రం ప్రారంభిస్తున్న సీఐ నాగరాజు

దహెగాం: ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సీఐ నాగరాజు అన్నారు. సోమవారం మండలంలోని లగ్గాం క్రాస్‌రోడ్డు వద్ద పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ సంతోష్‌గౌడ్, ఎస్సై సనత్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

చింతలమానెపల్లి: ఆరెకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆరెకుల సంఘం రాష్ట్ర కార్యదర్శి దుబ్బుల వెంకయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ దుండగులను వెంటనే పట్టుకోవాలని ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనపై జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలో నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దుబ్బుల నానయ్య, ఆరెకుల సంఘం మండల అధ్యక్షుడు టోంబ్రె శ్రీనివాస్, నాయకులు మల్లయ్య తదితరులు ఉన్నారు.

అంబలి పంపిణీ సద్వినియోగం చేసుకోవాలి


అంబలి పంపిణీ చేస్తున్న వినోద్

రెబ్బెన: వేసవిని దృష్టిలో ఉంచుకుని దేవార వినోద్ యువసేన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి పంపిణీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ వ్యవస్థాపకుడు దేవార వినోద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్‌తో పాటు పీహెచ్‌సీలలో అంబలి పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. యువసేన సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

6న వారసంత వేలం

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతీ శనివారం కొనసాగే వారసంత వేలాన్ని 2023 -24 సంవత్సరానికి ఈనెల 6న స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఈవో కృష్ణమూర్తి తెలిపారు. ఆసక్తిగల వారు గ్రామపంచాయతీ నియమనిబంధనల మేరకు వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి

కెరమెరి: కంటి లోపం ఉన్న ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, ఎంపీవో సుదర్శన్ అన్నారు. అంతాపూర్‌లో కొనసాగుతున్న కంటివెలుగు కేంద్రంతో పాటు ఉపాధిహామీ పనులను క్షేత్రస్థాయిలో సోమవారం పరిశీలించారు. వడదెబ్బ తగలకుండా ఉండేందుకు రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులను పరిశీలించారు. వారి వెంట సర్పంచ్, టీఏ ఉన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

కౌటాల: ఈనెల 17 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నట్లు సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో వీవోఏలు ఏపీఎం వెంకటరమణకు సమ్మె నోటీసు అందజేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్ములే దత్తు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఐకేపీ వీవోఏల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మె చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్, మహేశ్వరి, ముక్తేశ్, భీంరావ్, పద్మ, ప్రతిభా, కొండయ్య పాల్గొన్నారు.

గూడెం వారసంతకు రూ. 91వేలు ఆదాయం

చింతలమానెపల్లి: మండలంలోని గూడెం గ్రామపంచాయతీ వారసంతకు రూ.91వేల ఆదాయం సమకూరింది. సోమవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో వారసంతకు వేలం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి సునీల్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా గూడెం గ్రామానికి చెందిన బోయర్ దేవాజీ రూ. 91వేలకు వేలం దక్కించుకున్నారు. సర్పంచ్ రాఘవరెడ్డి, ఉపసర్పంచ్ ఎండీ ముషరఫ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శివాజీ మహరాజ్‌కు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

చింతలమానెపల్లి: ఛత్రపతి శివాజీ మహరాజ్ వర్ధంతి సందర్భంగా సోమవారం మండలంలోని ఆయా గ్రామాలలో ఘనంగా నివాళులర్పించారు. మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో శివాజీ విగ్రహం వద్ద పూలమాలలతో అంజలి ఘటించారు. ఎంపీపీ దుబ్బుల నానయ్య, ఆరెకుల సంఘం రాష్ట్ర కార్యదర్శి దుబ్బుల వెంకన్న, మండల అధ్యక్షుడు టోంబ్రె శ్రీనివాస్, ఆరెకుల సంఘం నాయకులు భీంకరి నారాయణ, టోంబ్రె సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని కాలనీలతో పాటు మండలంలోని గ్రామాల్లో సోమవారం శివాజీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆరె సంక్షేమ సంఘం మండల నాయకుల ఆధ్వర్యంలో కొత్త కాలనీలోని శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆరె సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు శంకర్, రమేష్, భగవాన్, కిషన్, సుధాకర్, లక్ష్మయ్య, రావుజీ, ఆశన్న, జైరామ్, దిలీప్, మహేష్, కిరణ్, సురేష్ పాల్గొన్నారు.

కౌటాల: శివాజీ మహరాజ్ అందరికీ ఆదర్శనీయుడని, ఆయన చూపిన మార్గంలో ప్రతీ ఒక్కరు నడవాలని ఆరె సంఘం మండల అధ్యక్షుడు వసంత్ రావ్ అన్నారు. సోమవారం స్థానిక ఆరే సంఘం భవనంలో శివాజీ వర్ధంతి నిర్వహించారు. గుడ్లబోరి సర్పంచ్ పాలే రాందాస్, సంఘం నాయకులు ఉమా మహేశ్, ఎల్ములే మధుకర్, శ్యాంరావ్, ప్రకాశ్, బద్రిశ్వర్, గుండాజీ పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు


చలివేంద్రం ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

రెబ్బెన: ప్రజలతో మమేకమై పోలీసులు మీకోసంలో భాగంగా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు జిల్లా పోలీసులు సిద్ధంగా ఉన్నారని డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని రెబ్బెన పోలీసుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం డీఎస్పీ శ్రీనివాస్ ప్రారంభించారు. సీఐ అల్లం నరేందర్, తహసీల్దార్ మల్లికార్జున్, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎస్సై భూమేష్, కోఆప్షన్ సభ్యుడు జహురోద్దీన్, బీఆర్‌ఎస్ మహిళా విభాగం నాయకురాలు శంకరమ్మ, నాయకులు ఆనంద్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలి


నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

రెబ్బెన: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నేలకొరిగిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి దుర్గం రవీందర్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సీపీఐ కార్యాలయంలో సోమవారం దొడ్డి కొమురయ్య 96వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోగే ఉపేందర్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి జగ్గయ్య, పట్టణ కార్యదర్శి మారం శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాయిల్ల నర్సయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పూదరి సాయి, మండల కార్యదర్శి సాయి, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి

కాగజ్‌నగర్‌టౌన్: తెలంగాణ సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య 96వ జయంతిని 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉద్యమకారుల సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, నాయకులు కలికోట రమణయ్య, ఝిల్లా గౌడ్, వాహబ్, నాగయ్య, దేవయ్య, నారాయణ, మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎంపీడీవోకు సన్మానం

రెబ్బెన: ఇటీవల బదిలీల్లో రెబ్బెన నూతన ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో వైస్ చైర్మన్ రంగు మహేష్‌గౌడ్, వైస్ ఎంపీపీ గజ్జల సత్యనారాయణ, సీఈవో సంతోష్, బీఆర్‌ఎస్ నాయకులు వెంకటేశం చారి, పల్లె రాజేశ్వర్‌రావులు ఎంపీడీవోను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు.

పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలి

కాగజ్‌నగర్‌రూరల్: గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని ఎంపీడీవో గౌరీశంకర్ అన్నారు. సోమవారం కడంబా, రాంనగర్ గ్రామాల్లో పర్యటించారు. మురికి కాలువల నిర్వహణపై ఆరా తీశారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఎదురు కాకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం రాంనగర్ గ్రామపంచాయతీలోని నర్సరీని పరిశీలించారు. కడంబా సర్పంచ్ రాజేశ్వరిరాజు, రాంనగర్ పంచాయతీ కార్యదర్శి అశోక్ ఉన్నారు.

ఉచిత హోమియోపతి క్లినిక్ తిరిగి ప్రారంభం


ప్రారంభోత్సవంలో పాల్గొన్న పదాధికారులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని బాల భారతి పాఠశాలకు ఆనుకొని ఉన్న భగవాన్ మహవీర్ జన్ కల్యాణ్ హోమియోపతి చికిత్సాలయాన్ని భగవాన్ మహవీర్ జయంతిని పురస్కరించుకొని సోమవారం పునః ప్రారంభించారు. జన్ కల్యాణ్ సమితి బాధ్యులు సుభాష్ చంద్ర ధాజేడ్ చేతుల మీదుగా చికిత్సాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కరోనా కాలంలో ఈ ఉచిత హోమియోపతి చికిత్సాలయం మూసివేశామని, ప్రజల విజ్ఞప్తుల మేరకు దీన్ని పునః ప్రారంభించినట్లు పేర్కొన్నారు. హోమియోపతి డాక్టర్ కె. నాగనిభిత ఆధ్వర్యంలో ఉచిత చికిత్సాలయం కొనసాగుతుందన్నారు. పదాధికారులు రవీందర్ సింగ్వీ, ప్రవీణ్ జైన్, సౌరబ్ సింగ్వీ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ‘పది’ పరీక్షలు ప్రారంభం


కెరమెరి: పరీక్ష కేంద్రం ఎదుట విద్యార్థులు

దహెగాం: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మండలంలో ఏడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు, 262 మంది విద్యార్థులు ఉన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 148 మందికి 146 మంది, కేజీబీవీలో 114 మందికి, 113 మంది హాజరైనట్లు సీఎస్‌లు నరేందర్, శ్రీనివాస్‌గౌడ్‌లు తెలిపారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షకు మొత్తం 172 మంది విద్యార్థులకు 167 మంది హాజరైనట్లు సీఎస్ గోపాల్, డీవో రవికుమార్ తెలిపారు. పరీక్షలు రాసిన విద్యార్థులకు మధ్యాహ్నం కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు జ్యూస్ పంపిణీ చేశారు.

కెరమెరి: మండలంలోని కెరమెరి, మోడి పరీక్ష కేంద్రాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని కెరమెరి, గోయగాం, అనార్‌పల్లి, మోడి, కేజీబీవీ, హట్టి, రాంజీగూడ, ఝరి పాఠశాలలకు చెందిన మొత్తం 340 విద్యార్థులకు 100శాతం హాజరైనట్లు సీఎస్‌లు ఆడే ప్రకాశ్, ప్రేంసింగ్‌లు తెలిపారు. కెరమెరిలో 165, మోడి పరీక్ష కేంద్రంలో 175 మంది పరీక్షలు రాశారు.

చింతలమానెపల్లి: మండలంలో ప్రారంభమైన పదో తరగతి వార్షిక పరీక్షలకు కస్తూరిబా విద్యాలయంలో 139 మంది విద్యార్థులకు 138 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 93 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మండల కేంద్రానికి చేరుకోవడానికి గంగాపూర్, రణవెల్లి, డబ్బా, గూడెం గ్రామాల విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు.

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, (ఏ), (బి), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలల్లోని పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో మొదటి రోజు పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల (ఏ) పరీక్ష కేంద్రంలో 152 మంది విద్యార్థులకు అందరూ, సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల(బీ) పరీక్ష కేంద్రంలో 158 మంది విద్యార్థులకు 157 మంది విద్యార్థులు హాజరవ్వగా ఒకరు గైర్హాజరయ్యారు. సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రైవేటు పరీక్ష కేంద్రంలో 43 మంది విద్యార్థులకు గాను 38 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా ఐదుగురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు సీఎస్ దేవాజి తెలిపారు.

తిర్యాణిలో..

తిర్యాణి: పదో తరగతి విద్యార్థులకు సోమవారం వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండలంలోని మొత్తం 240 మంది విద్యార్థులకు గాను మొదటి రోజు నిర్వహించిన తెలుగు పరీక్షకు 238 మంది విద్యార్థులు హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెడెంట్ రాజేశ్వర్‌రావు తెలిపారు. పరీక్ష కేంద్రంలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పకడ్బందీగా పరీక్షను నిర్వహించినట్లు పేర్కొన్నారు.

కాగజ్‌నగర్ పట్టణంలో..

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలో పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో ఆరు, మండలంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలకు 1654 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 12 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాధికారి భిక్షపతి వెల్లడించారు. పట్టణంలోని శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, జెడ్పీ బాయ్స్, గరల్స్, ఫాతిమా కాన్వెంట్ పాఠశాల, ప్రభుత్వ ఓల్డ్ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణ రెడ్డి పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

కౌటాలలో..

కౌటాల: కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులను ఉపాధ్యాయులు పరీక్ష కేంద్రం వద్ద తనిఖీ చేసి కేంద్రంలోకి పంపించారు. పరీక్ష కేంద్రాలను ఎస్సై ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 121 మంది విద్యార్థులకు ఒక్కరు గైర్హజరయ్యారు. జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 210 మంది విద్యార్థులకు ఇద్దరు గైర్హాజరయ్యారు.

ప్రాథమిక పాఠశాల సందర్శన

కెరమెరి: మండలంలో కెలిబి ప్రాథమిక పాఠశాలను జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. 5వ తరగతి విద్యార్థులతో తెలుగు, ఆంగ్లం చదివించారు. ఉపాధ్యాయులు అజయ్, శ్రీధర్, రమ్య కృష్ణ తదితరులు ఉన్నారు.

ఉత్తమ పంచాయతీ సర్పంచ్‌కు సన్మానం


సోమశేఖర్‌ను సన్మానిస్తున్న మహిళలు

రెబ్బెన: మండలంలోని నంబాల గ్రామ పంచాయతీ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ పంచాయతీల జాబితాలో జిల్లాస్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎన్నికైనందున సోమవారం మహిళలు సర్పంచ్ సోమశేఖర్‌ను సన్మానించారు. వార్డు సభ్యురాలు డోంగ్రి పద్మ ఆధ్వర్యంలో మహిళలు పంచాయతీ కార్యాలయంలో సోమశేఖర్‌ను సన్మానించారు. ఉప సర్పంచ్ అశోక్, మహిళలు పాల్గొన్నారు.

‘బార్ అసోసియేషన్’ విధుల బహిష్కరణ


విధులు బహిష్కరిస్తున్న న్యాయవాదులు

ఆసిఫాబాద్: న్యాయవాది వీరేంద్ర నర్వాల్‌ను హతమార్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి సతీశ్ బాబు, రాపర్తి రవీందర్ డిమాండ్ చేశారు. న్యాయవాది హత్యను ఖండిస్తూ బార్ కౌన్సిల్ పిలుపు మేరకు సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. కోర్టు ఆవరణలో వారు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం తేవాలన్నారు. దుండగులను కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ప్రకాశ్‌చంద్ర జైన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

‘నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం’


కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనప్ప

కౌటాల: సిర్పూర్(టి) నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి మండలాల్లోని పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌తోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యకర్తలు గ్రామాల్లో అందుబాటులో ఉండి పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని బోనగిరి సుధాకర్ ఇంట్లో నిర్వహిస్తున్న భాగవత సప్తహం కార్యక్రమానికి హాజరయ్యారు. కౌటాల, చింతలమానెపల్లి ఎంపీపీలు బసర్కార్ విశ్వనాథ్, దుబ్బుల నానయ్య, కౌటాల సర్పంచ్ వొజ్జల మౌనిశ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, ఉప సర్పంచ్ తిరుపతి, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు తాళ్లపల్లి రవీందర్‌గౌడ్, నాయకులు మధుకర్, ఫణిందర్ గౌడ్, శ్రీనివాస్, సంతోష్, రాంచందర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అంకుసాపూర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యలక్ష్మి బాలామృతం, కొర్రలు, రాగిలడ్డు, కంకులు, మర్మరాలు, ఆకుకూరలు బాగా తినాలని సూచించారు. కార్యక్రమంలో దుబ్బగూడ, అంకుసాపూర్, గోంది అంగన్‌వాడీ టీచర్లు మడావి కవిత, ఇస్సిబాయి, కవిత, పంచాయతీ సెక్రటరీ సంధ్య, తదితరులు పాల్గొన్నారు.